



# పల్లకి

## సింహప్రసాద్

వర్షం!

నాలుగు రోజుల్నుండి విరామ రహితంగా ఏకధాటిగా కసిగా కురుస్తోన్న వర్షం.

వర్షమా అది? కాదు కాదు. గాలివాన. పెనుతుఫాను. ప్రకృతి భీకర ఘర్జన. భైరవతాండవం.

చెట్లని పూతాపిందెల్లేవు. పెద్ద కొమ్మ

ల్లేవు. పొడుగాటి చెట్లసలు నిలబడే లేవు!

వియత్నాంపై అమెరికా కురిపించిన బాంబుల్లా అంతటినీ భీభత్సం చేసేస్తూ వర్షం! వర్షం!!

* * *

నా కెవ్వరితోడూ సాయం అక్కర్లేదంటూ రొమ్ము విరుచుకుని మహారాజ ఠీవితో ధనగర్వంతో కాస్త ఎత్తైన ప్రదేశంలో నిలబడి వుంది ప్రెసిడెంట్ వియ్యన్నగారి మేడ. ఆ చుట్టుప్రక్కలున్న ఇళ్ళని గడగడ లాడిస్తోన్న వర్షం ఆ మేడనేం చెయ్యలేక నిస్సహాయంగా చూస్తూ భోరున ఏడుస్తోంది!

ఆ మేడలోపలి హాల్లోని సోఫాల్లో వియ్యన్నగారూ ఆయన భార్యా పిల్లలూ అంతా స్వెట్టర్లు తొడుక్కుని పాటలు వింటున్నారు.

బహూశా ఇనప్పెట్టెలా వుండటం వల్ల కాబోలు లోపల వెచ్చగానే వుంది.

వియ్యన్నగారు చేతులు కట్టుకుని కాళ్ళాడిస్తూ కూర్చున్నారు. ఒంటికి స్వెట్టరూ తలకి మఫ్లరూ వున్నాయ్. ఆయన్ది కాస్త భారీశరీరం. నల్లగా తాటితొక్క రంగులో వుంటారు. వయస్సు నలభై అయిదు దాటుతోన్నా దృఢంగానే వున్నారు. ఆ దృఢత్వం చాలావరకూ ధనబలంతో స్థానబలంతో వచ్చిందే. హాయిగా ఫ్రీగా కూర్చున్న ఆయన్ని చూస్తే బయట కుంభవృష్టిగా వర్షం కురవటంలేదనీ 'ఆల్ ఈజ్ వెల్ విత్ ద వరల్డ్' అనీ అనిపిస్తుందెవరికైనా.

ఆయన భార్య గాయత్రీదేవిది బంగారు ఛాయ మెడలోని ఆభరణాల కన్నా ఎక్కువగా మొఖం మెరుస్తూంటుంది గర్వంతో. ఆమె ముక్కు గరుత్మంతుడి ముక్కులా వుంటుంది. అది అదృష్టసూచక మంటారు చాలా మంది. అదేమోగాని కోపం వచ్చినప్పుడు మాత్రం ఆమె ముక్కు ముక్కుపుటాలూ కూడా గొప్పగా కంపించిపోతాయ్. చిన్నకళ్ళు పెద్దవై నిప్పుల్ని కురిపిస్తాయ్. సాధారణంగా ఆమె కోప్పడిందీ అంటే అది పనివాళ్ళ మీదా రైతులమీదా మాత్రం అయ్యుంటుంది. ఆమె దొరసాన్లా సాగదీస్తూ మాట్లాడుతుంది. అలా మాట్లాడితే తన మాటలు చిలుకపలుకుల్లా వుంటాయనుకుంటుందామె. కాదని చెప్పగల ధైర్యం ఎవరికీ లేదు!

వాళ్ళకో ముగ్గురు చిరంజీవులు! అంటే వాళ్ళు ఎర్రత్రికోణం గుర్తుంచుకున్నారని కాదు. అసలు వాళ్ళకి పుట్టిందే ముగ్గురు, ఇంకా పుట్టేటట్టయితే వాళ్ళకేం అభ్యంతరంలేదు కూడా.

పెద్దవాడు లక్ష్మీవెంకట గాంధీ ప్రసాద్. పదేళ్ళుంటాయ్ వాడికి. హాలులో ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని చెడిపోయిన బ్యాట్రీలైట్‌తో కుస్తీపడుతు

న్నాడు. వాడ్ని చూసి "మన పెదబాబు తప్పకుండా పెద్ద ఇంజనీరవుతాడండీ" అని గాయత్రీదేవి అంటే అవునన్నట్టుగా తలూపి వాడ్నే చూస్తూండిపోయారాయన కొంచెంసేపు.

రెండోది ఇందిరా ప్రియదర్శిని. రబ్బరు బొమ్మలా వుంటుంది. గాజు అద్దంమీంచి పాముల్లా జారుతోన్న వర్షపుధారల్నీ దూరాన గాలికి అల్లల్లాడిపోతున్న చెట్లనీ మెరుగురు పురుగుల్లాంటి మెరుపుల్నీ వింతగా ఆశ్చర్యంగా ఆనందంగా చూస్తోంది. ఆ పిల్లని ఐ.ఏ.యస్. కు ట్రైనింగ్ చేయ్యాలని ఇప్పట్నుంచీ ఆ తల్లిదండ్రుల ఆలోచన.

మూడోవాడు సత్యనారాయణనెహ్రూ వరప్రసాద్. ఆరేళ్ళు వాడికి. బొద్దుగా ముద్దుగా వుంటాడు. తలుపు దగ్గర నిలబడి బయటికెళ్ళి కాగితపు పడవలతో ఆడుకుంటే బావుణ్నని చూస్తున్నాడు. వాడు తప్పకుండా నెహ్రూ అంత గొప్పవాడవుతాడని ఆ దంపతుల నమ్మకం.

పిల్లలు ముగ్గురూ ఖరీదైన స్వెటర్లు తొడుక్కున్నారు.

తెల్లటి బుల్లి సింహపు పిల్లలాంటి కుక్క 'జానీ' విశ్వనాథం గారి కాళ్ళ దగ్గర కూర్చునుంది. తిరగేస్తోన్న వీక్లీ లోంచి దృష్టి మరల్చి "ఈ తుఫాను ఇప్పుడప్పుడే తగ్గేట్టు లేదండీ. ఈ వాతావరణం చూస్తోంటే పిల్లలకి జలుబు చేసేట్టు కూడా వుంది. పోనీ టౌన్‌కి వెళ్ళిపోతే?" అంది గాయత్రీదేవి.

ఆయన తల పంకించారు గాని ఏమీ అనలేదు.

భార్య అన్నమాటల గురించాయన ఆలోచించడం లేదు. ఈ వర్షాలవల్ల ఈనుతున్న వరిచేలు దెబ్బతిన్నాయి గనుక వాటివల్ల వచ్చే నష్టాన్ని వడ్డీతో సహా ఎలా రాబట్టడమా అని ఆలోచిస్తున్నారాయన. ఈ వర్షంవల్ల వూరికి వూళ్ళే వారికి చాలానే నష్టాలు కలిగాయి గనుక ఈ వర్షం పేరుతో ఏమైనా సంపాదించడానికి వీలుంటుందేమో. నవి పథకాలు వేస్తున్నారాయన.

తిరగేస్తోన్న వీక్లీ ఇదివరకు చదివిందే గనుక గాయత్రీదేవికి బోరు కొట్టింది రేడియో పాటలూ ఆసక్తిగా లేకపోవడంతో అసహనంగా అటూ ఇటూ ఓ రెండు క్షణాలు చూసింది. ఆమె దృష్టి ఫ్లాస్కు మీద పడటంతో వెళ్ళి ఫ్లాస్కూ అయిదు కప్పులూ తెచ్చి టీపాయ్‌మీద పెడుతూ "ఒరేయ్ బాబూ- కేక్సుగాని బిస్కెట్లుగాని తింటార్రా" అంది

"వద్దు మమ్మీ" చివరి ఇద్దరూ జవాబిచ్చారు

"పోనీ ఒకటి తీసుకోండి బాబూ" అంటూ ప్రతి ప్లేటులోకి కేక్ ఇచ్చింది భర్తతో సహా అందరికీ తనూ ఒకటి తీసుకుంది

వాలుతూ జాపుతూ 'జానీ' విశ్వనాథం గారి కాళ్ళమీద కాళ్ళు పెట్టి ఆయన చేతి

లోని కేకీవంక అశగా చూడసాగింది.

"నీ జానీకి కూడా కావాల్టే" నవ్వారు వియ్యన్నగారు.

"దీనికి పెట్టకుండా ఎలా లెండి. దొంగలు పడకుండా కాపాడుతోంది అదే" అంటూ కుక్క బిస్కెట్ల పాకెట్లోంచి రెండు తీసి జానీకి పెట్టింది. అనంతరం ఫ్లాస్కులోని పాలు కప్పులో పోసి తలోక టీ అందించింది.

"పాపం అంజిగాడికూడా ఏదో పెట్టరాదుటే నాల్రోజుల్నుంచి కుక్కలా పడున్నాడు మన గుమ్మందగ్గర"

"ఇంకా నయం. వాడి పెళ్ళాం పిల్లలకూడా పంపమన్నారు కాదు. అయినా కుక్కలా కాపలా కాస్తూ మనం చెప్పిన పని చెయ్యడానికే కదండీ వాడ్ని పాలేరుగా పెట్టుకుంటా।" అంది గాయత్రీదేవి.

"అయితే మాత్రం ఈ రోజుల్లో అంతలా స్వామిభక్తితో వుండే వాళ్ళెవరు చెప్పు? మనం సీతారాముళ్ళం అయినా కాకపోయినా అంజిగాడు మాత్రం అంజనేయుడే"

"చాల్లెద్దురూ. డబ్బు పారేస్తే వీడేమిటి వీడి బాబులాంటి వాళ్ళు వందల మంది వస్తారు. అయినా ఎప్పుడూలేం దివాళ పాలేరుగాడిమీద ప్రేమ పుట్టు కొచ్చేసిందేమిటి మీకూ?"

"అది ప్రేమకాదే. ఇందాక కుక్కకి బిస్కెట్లు పెట్టావ్. దానిమీద ప్రేమ చేత పెట్టావా? లేదు. దాని కడుపు మాడకుండా పెడుతూంటే బాగా కావలా కాస్తుందని. ఒకవేళ మనం పెట్టలేదనుకో రెండు మూడుసార్లు ఓపిగ్గా చూస్తుంది. నాలుగోసారి మన చేతిలోది లాక్కుంటుంది. మనం దొరకనివ్వక పోతే ఇంకో ఇల్లు చూసుకుంటుంది."

"మన జానీ ఎప్పుడూ అలా చెయ్యదండీ" అభిమానంగా అంది.

నవ్వి అన్నారు. "మనం అలా అనుకోవడంలో తప్పు లేదనుకో. కాని మన అంజిగాడి విషయమే తీసుకో, మూడ్రోజుల్నుంచో నాల్రోజులుంచో ఇంటికెళ్ళనివ్వకుండా ఇక్కడే వుంచేశాం ఎప్పుడే అవసరం వస్తుందో అని. వాడికి మనమీద భక్తి, విశ్వాసాలున్నాయి గనుకే వున్నాడు. దాన్ని మనం కాపాడుకోవాలి మరి. అంటే వాళ్ళకేదో దోచిపెట్టెయ్యమని కాదు. అప్పుడప్పుడు ఓ మంచిమాటా ఓ మాంసం ముక్కా వేస్తే చాలు ఆ అజన్మాంతం మనకాళ్ళదగ్గరపడుంటారు. ఎప్పుడో మాటెలావున్నా వాడవసరం మనకిప్పుడెక్కువగా వుంది కూడాను..."

"అంటే, అన్నిప్పుడు కాకా పట్టమంటారా?"

"అదికాదే. నే చెప్పేది కాస్త విను మరి. వర్షం ఇలాగే వుంటే మనం పట్నం వెళ్ళాల్సిరావచ్చు. అప్పుడు మనం గూడుబండిలో వెచ్చగా కూర్చుంటే

వర్షంలో బండితోలేది వాడే. అంచేత ఏ టీయో, బి స్కెట్లో పాడెయ్యడం మంచిదంటున్నాను."

గాయత్రీదేవి ముఖం ఎర్రబడింది. ముక్కుపుటాలు కొంచెం గాలిదూరు తోంటే "ఇన్నాళ్ళూ ఈ సోషలిజం కబుర్లు బయటివాళ్ళకే అనుకున్నాను. ఇప్పుడు ఇంట్లో కూడా మొదలుపెట్టా రన్నమాట" అంది రోషంగా.

బొజ్జలదిరేలా నవ్వేరాయన.

"మీకు నవ్వులాటగానే వుంటుంది."

"అదికాదే...."

"మీరింకేం చెప్పక్కర్లేదు. కారు కొనాలండీ అంటే విన్నారా? కారుంటే ఇప్పుడా పాలేరుగాడ్ని దేబిరించాల్సిన కర్మ పట్టేదా?"

"కారుకైనా డ్రైవరు వుండాలిగా?"

ఆ మాటలకి అప్పుడాయన నవ్విన నవ్వుకి గాయత్రీదేవికి విపరీతంగా కోపంవచ్చి "అవున్లెండి. మీ అలగా బుద్ధికి అలగాజనమే ఎక్కువగా కవిపి స్తారు. వాళ్ళు లేకపోతే మనం బ్రతక లేమంటారు!" అంటూ లేచి విసవిసా వెళ్ళిపోయింది పడక గదిలోకి. తన పుట్టింటివారు భర్తవంశాన్నీ వంశస్తుల్నీ చులకన చేసి మాట్లాడుతూంటుందామె కోపంవచ్చినప్పుడల్లా!

"అదికాదే—" అంటూ వియ్యన్న గారు ఆప ప్రయత్నించినా ఆమె ఆగక పోయేసరికి వుస్సురంటూ నిట్టూర్చి లేచి బద్ధకంగా ఒల్లువిరుచుకుని వీధితలుపు తీసి తొంగిచూశారు.

అరుగుమూలన అంజిగాడు అని పిలవబడే అంజయ్య ముడుచుకుని కూర్చుని చిరుగుల రుమాలతో చలినుండి రక్షించుకోవాలని నానా యాతనా పడు తున్నాడు.

వాడ్ని చూసి తృప్తిగా నిట్టూర్చి "వున్నావుకదా" అన్నారాయన. వాడు కప్పుకోడానికో గుడ్డ ఇద్దామన్నఆలోచనే రాలేదాయనకి.

వాడు చేతులు కట్టుకుని తలూపుతూ దగ్గరికొచ్చి "ఓపాలి మా గుడిసెకెళ్ళొత్తా నండీ. పిల్లలూ ఆళ్ళూ ఎట్టావున్నారో ఏవోఁ...." అన్నాడు కళ్ళనిండా ఆశ నింపుకుని.

వులిక్కిపడ్డారు వియ్యన్నగారు.

"వెర్రివుగా న్లేరా అవతలేవో కొంపలు మునిగిపోతునట్టు ఇదవుతావేంరా. నీతో పనుందిగనకే వుండమన్నాను. నువ్వీ వూరొచ్చిన క్రొత్తలో ఎవ్వరూ నిన్ను పన్లో పెట్టుకోనంటే నేను పెట్టుకున్నానని మర్చిపోకు" అని వాడి మొఖంలోకి చూసి "చుట్టకావాలా? సిగ్గుపడక తీసుకో" అని స్వెట్టర్ క్రిందవున్న బనీను జేబు లోంచో చుట్ట తీసిచ్చి "నీతో పనుంది. ఎక్కడికి వెళ్ళకురేయ్" అని చెప్పి తలుపువేసి గదిలోకి నడిచారు.

మంచంమీద బోర్లాపడుకున్న భార్యని చూసి ఇంకా కోపం తగ్గలేదనుకుని



అ ప్రక్కనే కూర్చుంటూ, "ఒసే పిచ్చి దానా. మనలాంటి ధనికులకి మొదటి శత్రువు ఎవరో తెలుసా?" అని ప్రశ్నించారు.

ఎవరన్నట్లు చూసిందామె నుదురు చిట్లించి.

"మనకి ప్రభుత్వంవల్ల భయంలేదు. పోలీసులవల్ల ముందే భయంలేదు. దొంగలవల్ల కూడా భయంలేదు. వాళ్ళు కన్నంవేసినా మనకి తరిగేది కొంచెం బ్లాక్‌మనీయే గనుక. మరి మన శత్రువు లెవరంటావా అలగా జనమే. వాళ్ళు ఎదురు తిరగరు సాధారణంగా. మనం తిరగనివ్వంకూడా. తిరిగితే మన పని కాశీయే. అంచేత మనం జాగ్రత్తగా వుండాలి. మన పొలాల్ని పండించేదీ వాళ్ళే. మన మిల్లులోని చక్రాలు తిప్పేదీ వాళ్ళే. మన జల్సాలకి ఏర్పాట్లు చేసేదీ వాళ్ళే. మనకి ఓట్లేసి పదవుల్లో కూర్చోబెట్టేదీ వాళ్ళే. అంచేత వాళ్ళని అలగా జనంలోనే వుంచాలి. వాళ్ళకేదో ఆశ చూపుతూ అవసరమైతే బెదిరిస్తూ మన చెప్పుక్రింద వుండేట్లు చూసుకోవాలి. అప్పుడే మనమెక్కిన పల్లకిని వాళ్ళు మోస్తారు తెల్సిందా! నాకీ ప్రాంతంలో ఎదురనేది లేకపోయింది అంటే ఈ పాలసీ వల్లనే" అంటూ తన ఫిలాసఫీని వివరించారు వియ్యన్నగారు.

"అంటే ఆ కూలినాలి జనం లేకపోతే మనం సుఖంగా బ్రతకలేమంటారు? అంతా వాళ్ళగొప్పే అంటారు?" తీక్ష్ణంగా అందావిడ.

"పిచ్చిదానా వాళ్ళవల్ల మన పనులు నెరవేరుతున్నాయని వాళ్ళు మనకంటే

గొప్పవాళ్ళంటానా? వాళ్ళు లేకపోయినా మనం హాయిగా సుఖంగా బ్రతగ్గలం. డబ్బే అన్నీ అమర్చిపెడుతుంది మనకి. కాని మనం లేకపోతే వాళ్ళు మలమలా మాడి చస్తారు. అంచేత వాళ్ళతో మనకి పని వున్నప్పుడు కొంచెం మంచిగా వుండటం మన ప్రెస్టేజికి నష్టం కాదం టున్నాను. అంతెందుకూ ఇంత క్రితం వాడు ఇంటికెళ్ళొస్తానంటే కసిరి ఓ చుట్ట ఇచ్చేసరికి తోకముడుచుకుని కూర్చు న్నాడు. వాడు మళ్ళీ ఇంటికెళ్తానంటా దేమో చూడు," అన్నారు విజయ గర్వంతో.

అంతా విని భర్త తెలివితేటలకి మురిసి పోతూ "నిజమే సుమండీ. నేనంతదూరం ఆలోచించనేలేదు." అంది గాయత్రీదేవి.

"అందుకే అన్నారు ఆడవాళ్ళకి నోటి దురద ఎక్కువని" అని ఫక్కున నవ్వి "హాల్లో కూర్చుందాంరా. పిల్లలక్కా డుండగా మనం గదిలో వుండటం బావోదు." అన్నారు.

ఇద్దరూ హాల్లోకొచ్చి కూర్చున్నారు ఇందాకటి స్థానాల్లోనే. గాయత్రీదేవికేదో గుర్తుకొచ్చి పరుపుక్రింద పెట్టిన డిటెక్టివ్ పుస్తకం తెచ్చుకుని డిటెక్టివ్ భగవాన్ వెంట పరుగెత్త సాగింది. విస్సన్నగారు చెవిని రేడియో కప్పగించి ఏవేవో పథకా లేస్తూ కూర్చున్నారు.

బయట వర్షంమాత్రం యథాప్రకా రంగా కురుస్తూనేవుంది.

తల్లీ తండ్రీ తనని గమనించటం లేదని నిర్ధారణచేసుకున్న నెహ్రూవర ప్రసాద్ మెల్లగా తలుపుతీసుకుని వీధిలో కెళ్ళాడు. తమ్ముడి గురించి తల్లికి ఫిర్యాదుచేద్దామనుకున్న ఇందిరా ప్రియ దర్శిని వెంటనే తన అభిప్రాయాన్ని మార్చుకుని వీధి గుమ్మందగ్గర నిలబడి బయటికి చూడసాగింది.

ఇందాక విస్సన్నగారు చుట్టఇస్తే అంజయ్య కొంచెం సంబరంగానే అందు కున్నాడు. చుట్ట ఇచ్చినవారు అగ్గిపుల్ల కూడా ఇస్తారని చూశాడుగాని ఆయనదేం పట్టించుకోకుండా వెళ్ళిపోయారులోపలికి. పిలిచి అడగ్గల ధైర్యంలేక అక్కడే చుట్టపట్టుకుని నిలబడిపోయిన అతడికి ఆ అబ్బాయిని చూసేసరికి వుత్సాహం వచ్చింది.

"అబ్బాయిగోరూ ఓ అగ్గిపుల్ల తెత్తారా చుట్టెలిగించుకుంటా."

"ష్.... మాట్లాడకు. డాడీ వింటే కోప్పడతారు. బయటికొస్తే జలుబు చేస్తోందట. మమ్మీ వెళ్ళొద్దంటోంది." అన్నాడాకుర్రోడు ముక్కుమీద వేలుం చుకుని మరీ. తరువాత అన్నగారు చేసిచ్చిన కాగితప్పడవల్ని నీటి ప్రవాహంలో ^ ^ వినోదించసాగాడు.

వుస్సురంటూ వెళ్ళి యథాస్థానంలో ముడుచుకుని కూర్చున్నాడు అంజయ్య.

ఎన్నెన్నో ఆలోచనలు అతడి

మస్తిష్కం చుట్టూ ఈగల్లా ముసిరాయ్. మరెన్నో భయాలుకూడా చుట్టిముట్టాయ్.

'తన పూరిగుడిసెట్టా వుందో. తవ్వు కూలిపోలేదు గదా? తూర్పేపు గోడసలే అవిటిది. ఈ వోనకి తడిసి పడిపోలేదు గందా? ఇంటిది పిల్లల్తో ఏం అవత్తపడుతోందో ఏవో! గుంట దానికి తన దగ్గర మాలి మెక్కువ కూడానూ. ఎట్టా వుందో?.... అన్నట్టు పెద్దానికి వోనంటే భయం గదూ? అద్పరే అసలింట్లో కూడొంటానికి నూక అన్నాయో లేవో. మూడ్రోజులకన్నా ఎక్కువరావని ఇంటిది సెప్పి ఆర్రోజు లవ్వనేదూ? ఈ గాలోన్లో ఎట్టా అవత్త పడతన్నరో ఆ బగమంతుడికే తెల వాలా....!"

అతడి కళ్ళు చెమ్మగిల్లాయ్. మన సంతా ఆందోళనతో నిండిపోతోంది. తిన్నగా కూర్చోలేక అటూఇటూ పచార్లు చేయసాగాడు.

'ఎంత పాలేరోడైతే మాత్రం ఇంటి కుక్కాడుగా కాళ్ళకాడ పడుంటానికి. తనకీ పిల్లాజెల్లా వున్నారనీ ఆళ్ళవి సూసుకోవాలనీ ఆయనకి తెల్దావి? మర్నాల్రోజుల్నుంచి ఇక్కడే కట్టి పారేసారు గాని ఓసారి ఎల్లొత్తానంటే వల్లకాదంటున్నారు. ఆరితో ఎట్టుకుంటే ఇంతేగావి సెప్పాసెయ్యకుండా ఓ పాలి గుడిసెకెళ్ళొత్తే?"

అదే మంచిదవ్పించింది. ఏమైనా సరే వెళ్ళాలనే అనుకున్నాడు. కాని ఆ భావం ఎంతో సేపు నిలవలేదు.

"ఇన్నాళ్ళూ మంచోడవ్పించుకుని ఇయాల లిలాసేత్తే ఏవనుకుంటారో! విన్నట్నించా మొన్నట్నించా ఆరేళ్ళ నుంచి సేత్తన్నాడు ఈరిదగ్గరే. పైగా ఆరేళ్ళ క్రితం తూర్పునించి పొట్ట చేత బట్టుకుని ఈ వూరొచ్చినప్పుడు ఎవరూ నమ్మి పాలేరుగా ఎట్టుకోకపోతే ఈరే ఎట్టుకున్నారు పదేను బత్తాలకి. తర్వాతే తెలిసింది వూళ్ళో పాలేరుకి ఇరవై బత్తా లిత్తన్నారని. అయితే మాత్రం ఆ సాయం సిన్నదా సిటికదా? అప్పుడాయ నెట్టుకోకపోతే మలమలా మాడిపోయే వోరు కాదూ? అంతే మరి. అంతగా గుడిసె కూలిపోతే ఏ చూరుకిందో తల దాచుకుంటార్లే. కానక్కడున్నవన్నీ గుడిసెలేనే...."

ద్వైధీభావంతో నలిగిపోతున్నాడు అంజయ్య.

ఇంతలో దూరాన పిడుగుపడింది. అంజయ్య ఒళ్ళు భయంతో కంపించింది.

వియ్యన్నగారి చిరంజీవి తను వేసిన కాగితపు పడవలు బోల్తాపడి వేగంగా కొట్టుకుపోతూండటం చూసి సంతోషంతో కేరింతలు కొడుతున్నాడు.

పిడుగు శబ్దానికి డిటెక్టివ్ పుస్తకం లోంచి బయటపడి పిల్లలకోసం చుట్టూ చూసింది గాయత్రీదేవి. చిన్నబాబు

కన్పించలేదు. ఆదుర్దాగా "ఇందూ-చిన బాబు ఏడమ్మా" అని అడిగింది.

"బయట ఆడుకుంటున్నాడు మమ్మీ" ఇందిర జవాబిచ్చింది.

"బయటి కెందుకెళ్ళాడూ" అంటూ వీధిలోకొచ్చి "అయ్యో తడుస్తావయ్యా" అని చినబాబుని లోపలికి తీసికెళ్తూ "అలా ముంగిలా కూర్చుని చూడకపోతే బాబు తడుస్తాడు లోపలికెళ్ళమని చెప్పొద్దూ. బొత్తిగా విశ్వాసంలేని జాతి" అని అంజియ్యని ఈసడించి లోపలి కెళ్ళిపోయింది

సరిగ్గా అప్పుడు అంతవరకూ ఏవో పాటలు విన్పించిన రేడియో "ఒక ముఖ్య ప్రకటన...." అంది

ఆలోచనా సమాధిలోవున్న వియ్యన్న గారూ గాయత్రీదేవీ కూడా వులిక్కిపడి ముఖాముఖాలు చూసుకుని రేడియోవైపు తిరిగారు.

"నాలుగు రోజులునుంచి కుండ వృష్టిగా కురుస్తోన్న వర్షంవల్ల గోదావరి మట్టం విపరీతంగా పెరిగిపోతోంది. ఇప్పటప్పుడే గాలివాన తగ్గే సూచనలు కూడా కన్పించడం లేనందున గోదావరీ తీర గ్రామవాసుల్ని ముఖ్యంగా పల్లం లోని గ్రామప్రజలు ఆయా గ్రామాలు వదలి వెంటనే సురక్షిత ప్రాంతాలకి వెళ్ళాల్సిందిగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేస్తున్నారు. వాతావరణం ఇలానే వుంటే అయిదారు గంటల్లో గోదావరి పొంగి పల్లపు ప్రాంతాల్ని ముంచి వెయ్యొచ్చని పరిశీలకులు తెలియజేస్తు న్నారు...."

అదిరిపోయారు వియ్యన్నగారా వార్త విని. ఆయన భార్య విపరీతంగా భయ పడిపోతోంది. ఆమె ముఖం పాలి పోయింది కూడానూ. తనకెంతో ఇష్ట మైన డిటెక్టివ్ పుస్తకాన్నో పక్కకు విసిరేసి పిల్లల్ని పిలిచి వాళ్ళని సంది ట్లోకి తీసుకుంటూ, "అయితే త్వరగా టౌన్‌కి వెళ్ళిపోదామండీ రేడియోవాళ్ళని నెవరు నమ్మమన్నారు. నాలుగ్గంటల్లో వస్తుందన్న ముంపు రెండు గంటల్లోనే రావచ్చు" అంది కంపితస్వరంతో.

ఆయన కూడా కంగారుపడుతూ లేచి, "అలాగేనే. ముందు ముఖ్యమైన సామానదీ సర్దు. క్రింది గదుల్లోని సామా నుని మేడమీది గదుల్లో పెట్టించేద్దాం" అన్నారు.

"ముంపు గురించి తెలిస్తే అంజిగాడు ఇంటికి పారిపోతాడేమోనండీ"

"పారిపోతాడా? పారిపోడాని కెన్ని గుండెలంట వాడికి? తోట వొలిచెయ్యమా వెధవని!" రెచ్చిపోతూ అన్నారు.

"అదికాదండీ. అవసరం మనది గనుక మంచిగావుండి పనులు చేయించు కోవాలన్నారుగా."

అంత కోపంలోనూ నవ్వి "నా ఫిలాసఫి బాగానే వంటబట్టిం దన్నమాట.




అందుకే ఓ ప్లాన్ సిద్ధంచేశా. ఓ పాతిక రూపాయలు ఆశచూపితే చాలు మనం వెళ్ళమన్నా వెళ్ళడు" అని అంజియ్యని పిలిచి గబగబా విలువైన సామానుని పైగదుల్లోకి జేర వేయించి, డబ్బూ బంగారం ఇతర ముఖ్య సామాగ్రి కొన్ని బట్టలూ సూట్ కేసుల్లోకి సర్దేశారు భార్యసాయంతో వియ్యన్నగారు.

అన్నీ రెడీఅయ్యాక అన్ని గదులకీ తాళాలువేసి రెండెడ్ల బండి కట్టించారు టార్పాలిన్ తో గూడు కట్టించారు.

"ఒరే అంజిగా, పరుగున మా తమ్ముడింటికీ మునసబుగారింటికీ వెళ్ళి మేం పట్నం వెళ్ళిపోతున్నామనీ వాళ్ళనీ వచ్చెయ్యమనీ చెప్పు. గోదారి పొంగుతోందనీ మనూరిని ముంచెయ్యొచ్చుని రేడియోలో చెప్పేరని చెప్పు."

"అయ్యబాబో! మనూరు—మునిగిపోద్దాండి" అరికిసెప్పి అలా మా గుడిసెకూడా ఎళ్ళి సెప్పొత్తా నయ్యగోరూ"

"నోర్ముయ్యరా దొంగనాయాలా. మేం త్వరగా పోవాల్రా అంటే వీడు ఇంటికెళ్ళొస్తాట్ట!"

"అది కాదయ్యగోరూ! మా గుడిసె—మా పిల్లలు...!"

"నోర్ముయ్యమంటే నీకాడున్రా లంజాకొడకా. అణాకాని గుడిసె కోసం మమ్మల్ని ముంపులో విలువునా ముంచేద్దామనుకుంటున్నావ్రా? నీ గుడిసె నీ పెళ్లాం ఏం అవ్వరుగాని మమ్మల్ని

పట్నంలో దిగబెట్టి రే పొ ద్దు పు గా న్లే. ముందెళ్ళి మా తమ్ముడితోనూ వాళ్ళ తోనూ చెప్పిరా. అట్నుంచటు మీ ఇంటికి కెళ్ళావో మళ్ళీ తిరగదన్నటవే కాదు పెట్రోలు పోసి నిలువునా కాల్చిపారే స్తాను. జాగ్రత్త - పో వెధవా" గర్జించా రాయన.

నోరు మూసుకుని కామందుగారి హుకుంని అమలుపరచడానికి వర్షంలో కెళ్ళబోతున్నవాడల్లా మునసబుగారి పాలేరు పరుగెత్తుకిటు వస్తూండటంతో ఆగిపోయాడు.

"ప్రెసిడెంటుగారూ - మనూరికి వరదొత్తాదంటండి రేడియో సెప్పిం దంట. మా కాపుగారు పట్నం ఎళ్ళి పోతున్నారు. తవరికి సెప్పమన్నారు" అన్నాడు బిగురుస్తూ.

"మేమూ బయల్దేరుతున్నాంగాని మా తమ్ముడికి చెప్పేవా ?"

"అయ్ - బత్తానండి" అంటూ పరు గిచ్చుకున్నాడు వాడు.

"ఇంకా అలా రాతిబొమ్మలా నిలబడ్డా వేంరా బండికట్టి తీసుకురా" అని హుంక రించి మళ్ళీ ఏమనుకున్నారో ఏమో "ముంపు ఇవాళొస్తుందని రేడియో చెప్ప లేదురా. రేపో ఎల్లుండో వస్తుందట. నువ్వేం కంగారుపడకు. పట్నం వెళ్ళేక నీకో పాతిక రూపాయలిస్తాలే. ఈరాత్రి ఇల్ని చేద్దువుగానీ పట్నంలో. రేపొచ్చి నీ పెళ్లాంపిల్లల్ని తీసుకొద్దువు గాని - బండిస్తాలే" అన్నారు, చేపకి ఎరవేస్తున్న ధోరణిలో.

కదలక తప్పలేదు అంజియ్యకి.

వియ్యన్నగారు భార్యాపిల్లల్తో సూట్ కేసుల్తో బండెక్కారు. వారి ప్రియమైన 'జానీ'ని కూడా ఎక్కించుకుంటే కొంచెం ఇరుకవ్వచ్చనిపించింది.

"జానీ బండి కూడా వస్తుంది లెద్దురూ" అనేసి వెనక టార్పాలిన్ కప్పే సింది గాయత్రీదేవి జల్లుకొట్టకుండా.

బండి కదిలింది.

వర్షంలో తడుస్తూ మొరుగుతూనే బండి ఎక్కించుకుంటారని కాబోలు బండి చుట్టూ తిరిగి తిరిగి విరాళచెంది వరుగున మళ్ళీ మేడదగ్గరికెళ్ళి అరుగు ఎక్కి గట్టిగా మొరగసాగింది జానీ.

ఆ కుక్క చేసిన పని చూసిన అంజియ్య "దానికన్నా తీసికట్టయి పోయింది నా బతుకు" అనుకున్నాడు.

హోరున కురుస్తోన్న వర్షంలో పెను గాలిలో మోకాళ్ళలోతు మట్టిలో ముందు కడుగెయ్యడానికి ఎద్దులు అయిష్టత ప్రదర్శిస్తోంటే వర్షంలో తడుస్తూనే అతికష్టంమీద తోలుతున్నాడు అంజియ్య.

"త్వరగా తోల్రా" కసిరాడు వియ్యన్నగారు.

ఎద్దు లాగిపోయాయ్. తోక మెలిపెడు తున్నా కపుస్కర్రతో బాదుతోన్నా పరే కదల్దం లేదవి.

"బండి దిగి తోల్రా" పురిమారాయన.

బండిదిగి ఎద్దుల డొక్కల్లో కర్రతో పొడిచాడు. బండి కదిలింది. బండితోబాటు నడుస్తూ ఎద్దుల డొక్కల్లో పొడుస్తూ తోలుతున్నాడు అంజియ్య. భార్యాబిడ్డల్ని తలచి ఓ చెంప కన్నీరు కారుస్తూనే.

"చూశావుటోయ్. వాడు పారిపోతాడేమో అన్నావుగా" గర్వంగా అన్నారు వియ్యన్నగారు నెమ్మదిగా భార్యతో.

"అవును సుమండీ. నే నేదేదో అనుకొనేదాన్ని కానీ సమయానికి ఈ పాలేరుగాడు లేకపోతే చచ్చేంత యాతనవును కదండీ."

"వాడు లేకపోవడమన్న ప్రశ్నే లేదసలు. వాడు మన డబ్బుకీ మనం ఏదో చేసేస్తామన్న భయానికీ లొంగక తప్పదు. మనల్ని కాదంటే రేపు వాడ్ని వూళ్ళో వుండనిస్తామా చెప్పు? అందుకే వాళ్ళు లొంగివుంటా రెప్పుడూ మనకి. మనం మంచివాళ్ళలా వుంటూ మధ్య మధ్య అవసరమైనప్పుడు హెచ్చరిస్తుంటే చాలు మన పనులన్నీ నిర్విఘ్నంగా సాగిపోతాయ్".

గోదావరిగట్టు దగ్గరకొచ్చింది బండి.

గోదావరి శివమెత్తినట్లు పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తోంది.

ఉగ్ర గోదావరిని చూసేసరికి అంజియ్య గుండెలు జారిపోయాయ్. అతడెన్నడూ ఇంత భయంకరంగా విజృంభిస్తోన్న గోదావరిని చూడలేదు. ఇంకొంచెం సేపిలాగే వుంటే గోదావరి పొంగి గట్టుని దాటి వూరిని ముంచెయ్యెచ్చన్పించడంతో బండిని తోలడం మాని గోదావరి వంక చూస్తూండిపోయాడు.

బండి ఆగిందేవిటాని చూసిన వియ్యన్నగారు గోదావరివంక చూస్తోన్న అంజియ్య కన్పించేసరికి వులిక్కిపడ్డారు. "పాతిక్కాదు యాభై రూపాయలిస్తాన్లేరా. త్వరగా పోనీ" అన్నారు.

ఆ మాటలు వినబడనట్లే వుండిపోయాడతను

"నిన్నేరా దొంగపీనుగా. బండి తోలకపోతే కాల్చిపారేస్తా - ఏవే బేగ్ లోంచి నా పిస్తోలు తియ్యి...."

ఆ మాటలతడికి విన్పించడం లేదు. కళ్ళముందు వుప్పొంగుతోన్న గోదావరీ అది పొంగితే వరదకాహుతయ్యే వూళ్ళోని జనమూ కదుల్తున్నారు. చెవుల్లో వారి హాహాకారాలు మాత్రం మారుమోగుతున్నాయ్.

అంతే. "వరదొస్తోందోహోయ్" అంటూ గట్టిగా అరుచుకుంటూ వూళ్ళోకి పరుగెట్టాడు అంజియ్య. వియ్యన్నగారి తిట్లనీ బెదిరింపుల్నీ లెక్కచెయ్యకుండా.

వియ్యన్నగారి బండి బోయీలులేని పల్లకిలా నిలిచిపోయింది గోదావరి ఒడ్డున ఒంటరిగా కుండపోతగా కురుస్తోన్న వర్షంలో.

---